# ముందడుగు

-ఐ.వి. చంద్రశేఖర్

పడక్కుర్చీలో మరోసారి అసహనంగా కదిలారు పరంధామయ్య గారు. ఎంతకీ ఓ కొలిక్కి రావట్లేదు ఆయన ఆలోచనలు. గజిబిజి ఆలోచనలతో మనసంతా చికాకుగా ఉంది ఆయనకు.

సుమారు నలభై ఐదేళ్ళుంటాయి పరంధామయ్య గార్కి. జీవితంలోని ఎదురు దెబ్బలు, ఆటుపోట్లు, బరువు బాధ్యతల వల్ల మరో పదేళ్ళు ఎక్కువగా కనబడుతుంది ఆయన వయస్సు. మధ్య తరగతి కుటుంబం. ఓ మోస్తరు ప్రభుత్వ ఉద్యోగం. ఈ మధ్యనే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి, ప్రస్తుతం ఓ ప్రైవేట్ కంపెనీలో పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ సంసారం గుట్టుగా నెట్టుకొస్తున్నారు.

ఆయనకు అన్నివిధాలా అనుకూలవతియైన భార్య జానకమ్మగారు. ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయి లలిత. చిన్నమ్మాయి రజిత.

లలితకు ఇంటర్ కాగానే, పై చదువులు చదువుతానని ఎంత మొత్తుకున్నా వినకుండా, మంచి సంబంధం తప్పిపోతుందని పెళ్ళి చేసేసి చేతులు కడుక్కున్నారు పరంధామయ్య గారు.

లలిత అత్త కాంతమ్మగారిది బాగా కలిగిన కుటుంబం. పెద్దపెద్ద బంగళాలు అపార్ట్‌మెంట్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆటో మొబైల్ బిజినెస్ మొదలైనవన్నీ ఉన్నాయి.

కాంతమ్మగార్కి భర్త లేదు. ముగ్గురు కొడుకులు, ఒక్కర్తే కూతురు. పెద్దవాడికి పెళ్ళైంది. రెండవవాడే లలిత భర్త. మూడవ వాడు పెళ్ళికి ఉన్నారు. కూతురుకి పెళ్ళయి రెండేళ్ళు అవుతుంది. ఐనా, నెలలో ఇరవై రోజులు పుట్టింట్లోనే మకాం వేస్తుంది. ఈవిడ గారంటే, కాంతమ్మకు ఆమె పుత్ర సంతానానికి పంచప్రాణాలు.

కాంతమ్మగారి భర్త పోయేటప్పటికి పిల్లలంతా చిన్నవాళ్ళు. అయినా కాంతమ్మ తన తెలివి తేటలతో పిల్లల్ని, ఆస్తుల్ని బాగాపెంచి నేడు ఈస్థాయికి వచ్చింది.

కాంతమ్మ అంటే అందరికీ హడల్. చిన్నప్పట్నుంచీ కొడుకులను చాలా జాగ్రత్తగా తనమాట జవదాటకుండా, తనే లోకంగా, తనే సర్వస్వంగా వాళ్ళని తన గుప్పెట్లో పెట్టుకుని మరీ పెంచింది. ఆ ఇంటిలో ఆమె మాటంటే మాట – పాటంటే పాట ఎంత చెబితే అంత. ఈ లక్షణాలన్నీ పుణికి పుచ్చుకుంది కూతురు కుముద.

కాంతమ్మగారి ఆస్తిపాస్తులు, ఆడంబరాలు చూసి పరంధామయ్యగారు, తన కూతురు బాగా సుఖపడుతుందనీ, కార్లలో షికార్లు తిరుగుతుందని ఆశపడి, తనకు శక్తికి మించినా వాళ్ళు కోరిన కట్నకానుకలు – లాంఛనాలు అన్నీ సమర్పించుకుని, నానా కష్టాలు పడి కూడబెట్టిన సొమ్మంతా వాళ్ళకు ధారపోసి అది చాలక అప్పుల పాలయ్యారు. ఆ అప్పులు తీర్చటానికి వేరే దారిలేక పిత్రార్జితంగా వచ్చిన స్వంత ఇంటిని కూడా తెగనమ్మి, ఇప్పుడు అద్దె ఇళ్ళల్లో కాలక్షేపం చేస్తున్నారు.

ఇంతా చేసి కూడా లలిత కాపురమైనా బాగుందా? అంటే అదీ లేదు. రోజంతా ఇంటిల్లిపాదికీ వెట్టి చాకిరీ చేయడం, వాళ్ళ ఛీత్కారాలు, తిట్లు, శాపనార్థాలతో కడుపు నింపుకోవడం నిత్య కృత్యమైంది. పెద్ద కోడలు పరిస్థితి కూడా అంతే.

కోడలు అంటే వాళ్ళ దృష్టిలో కట్నం తెచ్చే పనిమనిషి. బానిస. కానీ ఈ సూత్రం వాళ్ళ ఆడపిల్ల విషయంలో తద్భిన్నం. పోనీ భర్త అయినా ప్రేమగా చూసుకుంటాడా అంటే, అదీ లేదు. అందరూ అందరే. ఆ తానులోదే కదా ఈ గుడ్డ కూడా. వాళ్ళ సంతోషాలు, వాళ్ళ సరదాలే కాని ఇంట్లో భార్య అనే ప్రాణి ఒకటి వుంది అన్న ఆలోచన శూన్యం. రాత్రుళ్ళు పక్కలోకి మాత్రమే పెళ్ళాం అవసరం. ఆ తర్వాత అదొక పనిచేసే

యంత్రం.

కాంతమ్మ గారిది చాలా క్రూర స్వభావం. భర్త మరణానికి ఈమె కారణమని చాలామంది నమ్మకం. తన కూతురు తప్ప ఎవ్వరూ సుఖంగా ఉండడం చూడలేదు. కొడుకులు భార్యలతో అన్యోన్యంగా ఉంటే, ఎక్కడ ఆమెకు దూరమవుతారో, ఎక్కడ తన అధికారం నశిస్తుందో అని, ఎక్కడ తన కూతురును సరిగా చూడరో అని భయం. అందుకే ఎప్పటికప్పుడు కోడళ్ళ మీద ఏవేవో కల్పించి చెప్పి వాళ్ళను విడదీస్తూ ఉంటుంది. ఇందులో తనవంతు పాత్రను సమర్ధంగా పోషించి మరింత రక్తి కట్టించేది కుముద.

ఫలితంగా విరిగిన ఎముకలే గాని విరగని ఎముకలు ఉండేవి కావు కోడళ్ళకి. ఆ ఇంట్లో మరో దారుణం ఏంటంటే - భర్తే కాక అత్త, ఆడబిడ్డ, బావ, మరిది ఎవరికైనా వీళ్ళ పైన చేయి చేసుకునే హక్కు ఉంది. అందరూ కలిసి చేయి చేసుకోవడం, ఆ ఇంట్లో సర్వసాధారణ విషయం.

అది ఒక భూతాల నిలయం. శాడిస్టుల కొలువు. అత్తింటి ఆరళ్ళ సాలెగూడు. ముష్కర్ మహల్. బయటి ప్రపంచంలో మటుకు పెద్దమనుషులుగా చలామణీ అవుతున్న విషనాగులు. ఆ ఇల్లు ఒక అందమైన మేడిపండు.

లలిత పెళ్ళైన ఆర్నెల్ల కల్లా కట్నకానులకి, పెళ్ళి ఖర్చులకి, అల్లుడు అలకలకి, ఆడపడుచు ఆశలకి, వియ్యపురాలి వింతవింత లాంఛనాలకి, గొంతెమ్మ కోరికలకి వెరసి అక్షరాల ఆరు లక్షల రూపాయలు ఆవిరైపోయాయి పరంధామయ్య గార్కి.

కుందనపు బొమ్మలా మిసమిసలాడుతూ, అత్తింట అడుగుపెట్టిన లలిత మాత్రం చిక్కిశల్యమై ఎముకల గూడులా మారింది.

మెట్టినింటి వేధింపులు ఎన్నిసార్లు వివరించినా, "తప్పదమ్మా, అన్నిటికీ మనమే సర్దుకుపోవాలి. నిదానంగా అన్నీ అవే సర్దుకుంటాయి. నువ్వు మాత్రం తొందర పడి. ఆవేశంతో అనర్థాలు తేవద్దు. నీ వెనక పెళ్ళికి నీ చెల్లెలు ఉంది అని మర్చిపోకు" అని ఖరాఖండిగా చెపే తండ్రి వంక నిస్సహాయంగా చూసేది లలిత.

ఇలా చావలేక, బ్రతకలేక నిస్తేజంగా రోజులు వెళ్ళదీస్తూనే లలితకు నెల తప్పింది. మూడవ నెల అని కన్‌ఫర్మ్ చేసింది డాక్టర్. దీనితో కొంత ఊరట కలిగింది లలితకు. నిరాశతో బ్రతుకుతున్న లలిత జీవితంలో క్రొత్త ఆశలు చిగురించాయి.

కానీ, ఆ నీచులు ఆగడాలు ఆగలేదు. గర్భిణీ అని కూడా చూడకుండా పైశాచికంగా ప్రవరిస్తున్నారు. చీటికి మాటికీ, అయినదానికీ కాని దానికీ హింస... ఒకటే హింస... అది క్రమేపి హత్యాప్రయత్నాల వరకు వెళ్ళింది.


ఇహ, అక్కడే వుంటే, తనకి తన బిడ్డ ప్రాణాలకి కూడా గ్యారంటీ వుండదని గ్రహించిన లలిత, ఒకరోజు సమయం చూసుకుని సాహసం చేసి ఆ మృత్యుకుహరంలోంచి తప్పించుకుని బయటపడి పుట్టిల్లు చేరింది. అప్పుడు ఆమెకు ఆరవనెల.

తిరిగి అత్తవారింటికి పంపటానికి పరంధామయ్యగారు నయానా - భయానా ఎన్ని విధాల చెప్పినా లలిత ససేమిరా విన్లేదు. "పోనీలెండి. లేవలేని పిల్ల. పైగా తొలి కాన్పు. పురుడు పోసే బాధ్యత మనదే కదా. కాన్పు అయినాక పంపుదాము. బిడ్డ పుట్టాక అయినా వాళ్ళలో మార్పు వస్తుందేమో, చూద్దాం" అని జానకమ్మ గారు సర్దిచెప్పడంతో అప్పటికి మిన్నకుండి పోయారు పరంధామయ్యగారు చేసేదేమీ లేక.

ఈ లోపు అనేక నిందలు మోపి, నానా పుకార్లు పుట్టించి ప్రచారం చేసి తప్పు అంతా వీళ్ళ పైకి నెట్టారు కాంతమ్మగారు.

పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది లలిత. ఎన్ని కబుర్లు చేసినా బిడ్డను చూడడానికైనా రాలేదు కాంతమ్మ వాళ్ళు.

లలితను మళ్ళీ కాపురానికి పంపడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఒప్పుకోవడం లేదు కాంతమ్మ వాళ్లు. ఎన్ని అవమానాలు, అపహాస్యాలు ఎదురైనా తన ప్రయత్నాలు మటుకు మానలేదు పరంధామయ్య గారు. ఆఖరి ప్రయత్నంగా ముందురోజే వెళ్ళి వచ్చారు. నలుగురు మధ్యవర్తులను వెంటబెట్టుకుని.



ఎట్టకేలకు, చిట్టచివరకి కొన్ని షరతులతో ఒప్పుకున్నారు కాంతమ్మ వాళ్ళు.

అవి ఏమిటంటే:

ఒకటి: గ్రామ పంచాయతీలో ఊరి జనం ముందు "మాదే తప్పు" అని ఒప్పుకొని పరంధామయ్య - జానకమ్మ దంపతులు, లలిత కాంతమ్మ వాళ్ళు కాళ్ళు పట్టుకొని క్షమాపణ కోరాలి.

రెండు: తమకు జరిగిన పరువు (?) నష్టానికి రెండు లక్షలు రూపాయలు పరిహారంగా చెల్లించాలి.

మూడు: ఇక నుంచి లలితకు పరంధామయ్యగారి కుటుంబంతో ఎలాంటి బంధుత్వం ఉండకూడదు. ఆమె చచ్చినా, బ్రతికినా ఎవ్వరికీ సంబంధం లేదు.

ఇందుకు వారం గడువు ఇచ్చింది కాంతమ్మ. గడువు దాటితే విడాకులు పత్రంపై లలిత సంతకం చెయ్యాలి.

***

ఇదిగో ఈ ఆలోచనలతోనే సతమతమవుతున్నారు పరంధామయ్య గారు. 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా వుంది పరిస్థితి. లలిత తిరిగి

కాపురానికి వెళ్ళడానికి సుతరామూ ఇష్టపడటం లేదు. అలాగని ఎంతకాలం ఒంటరిగా బ్రతకగలదు? తామెంతకాలం ఉంటారు. ఆమె మంచి – చెడు చూడటానికి తాము కన్ను మూశాక ఆమె పరిస్థితి ఏమిటి? అందునా ఆడపిల్ల తల్లి.

అదీగాక, చిన్నమ్మాయి రజితకు మంచి సంబంధాలు రావాలన్నా, పెళ్ళి చేసి పంపాలన్నా లలిత కాపురానికి వెళ్ళి తీరాలి.

తన దగ్గర వి.ఆర్.యస్. తీసికోవటం వల్ల వచ్చిన పైకం రెండు లక్షల దాకా బ్యాంక్‌లో వుంది. అవి తెచ్చి కాంతమ్మగార్కి ఇవ్వవచ్చు. కానీ, అవి కాస్తా ఖర్చు చేస్తే, మరి రజిత పెళ్ళి ఎలా చేస్తాడు? అసలు తాను స్వచ్ఛంద పదవీ విరమణ చేసిందే రజిత పెళ్ళికి డబ్బుకోసం.

ఎంత ఆలోచించినా కనుచూపుమేరలో పరిష్కారం కనబడటం లేదు పరంధామయ్య గార్కి.

ఇదంతా గమనిస్తున్న లలిత మౌనంగా తన గదిలోకి వెళ్ళింది ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా.

"నాన్నా,

మధ్యతరగతి మనస్తత్వం నుండి బయటపడలేని నువ్వు, నా విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటావో ఊహించలేనిది కాదు.

చెల్లెలి పెళ్లికోసం దాచిన రెండు లక్షలు ఆ దుష్టుల చేతుల్లో పోసి, వాళ్ళ కాళ్ళు పట్టుకొని జీవచ్ఛవాల్లా బ్రతకటం నాకు యిష్టం లేదు.

ఎంత సేపటికీ నన్నొక భారంగా భావించి, ఆ బరువును ఎలా దింపుకోవాలా – అని భావించావే కాని, నా మనస్సుని బాధల్ని - భావాల్ని, కష్ట – సుఖాలనీ అర్థం చేసికోలేక పోయావు. ఆడ పిల్లలకు ఇష్టం – అయిష్టం, మనసు – మమత, ఆప్యాయత – అనురాగం, ఆశలు – ఆశయాలు, అభిమానం, ఆత్మగౌరవం, వ్యక్తిత్వం ఉంటాయని చాలామంది ఆడపిల్లల తండ్రులలాగే నువ్వు కూడా ఆలోచించలేక పోయావు.

అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని ఎదిరించలేక, కన్న కూతురు భవిష్యత్తుని పణంగా పెట్టి సమస్యలలో చిక్కుకుని ఆవేదన చెందావు. నీ కష్టార్జితం, పిత్రార్జితం, మానమర్యాదలు, గౌరవాభిమానాలు, సుఖసంతోషాలు అన్నీ కూడా ఆ తుచ్ఛుల కోసం ధారపోశావు.

కాని జరిగిందేమిటి? ఒరిగిందేమిటి?

నా జీవితం నుండి గుణపాఠం నేర్చుకోకుండా మళ్ళీ అదే తప్పు చెల్లెలి విషయంలో చేయబోతున్నావు.

ఆడపిల్లను కనటమే మహాపాపం. దాన్ని ఎంత తొందరగా వదిలించుకుంటే అంత మంచిది అన్న భావన విడనాడి, ఆడపిల్లల తల్లిదండ్రులందరూ తమ బిడ్డలు స్వతంత్రంగా జీవించేలా, వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడేలా ప్రయత్నించాలి. అలా స్థిరపడి, ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకొని ఉంటే, ఆ తర్వాత ఒకవేళ నాకులాగ ఎదురు దెబ్బలు తిన్నా కూడా చెల్లాచెదురు కాకుండా తట్టుకొని నిలబడ గలుగుతారు. వాళ్ళ బిడ్డలను అనాధలుగా వదిలి వేయకుండా, పెంచి పోషించి ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయగలుగుతారు.

కాబట్టి, దయచేసి చెల్లెలికి పెళ్ళి సంబంధాల గురించి కాక దాని జీవితానికి మంచి భవిష్యత్తును అందించేందుకు ప్రయత్నించమని నా ప్రార్థన.

ఇహ నా విషయానికి వస్తే.... మీకు భారంగా, సమస్యగా వుండడం నాకిష్టం లేదు. నా ప్రయత్నం ఫలించి చైల్డ్ కేర్ సెంటర్‌లో ఉద్యోగం దొరికింది. ఈ రోజే అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చింది. మీకు చెబితే ప్రయోజనం వుండదని చెప్ప లేదు. నా కాళ్ళమీద నేను నిలబడి, నా బిడ్డను నా ఆశయాలకు, నేటి సమాజానికి అనుగుణంగా పెంచగలననే ఆత్మవిశ్వాసం నాకుంది.

కానీ – అంతతేలికగా ఆ దుష్టబృందాన్ని విడిచి పెట్టను. చట్టపరంగా వాళ్ళకెలా బుద్ధిచెప్పాలో నాకు తెలుసు. మరొక స్త్రీ బలిపశువు కావడం నేనొప్పుకోను. ఆ దిశగానే నేను ముందడుగు వేస్తున్నాను"

"నమస్కారములతో..."

మీ

లలిత

(సమాప్తం)